సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం। 3। జూలై। 2023



రైతులకు మిత్రలాభం..!

రైతుల కష్టార్జితాన్ని తినేసే చీడ పురుగులను నాశనం చేసేందుకు మేలు చేసే పురుగులను కూడా ప్రకృతి సృష్టించింది.

- 8లో



మాయలేడీ అరెస్టు

పట్టణంలోని యూనియన్ బ్యాంకు వద్ద వృద్ధుడ్ని నమ్మించి ఇంటివద్దకు చేర్చి రూ.లక్షన్నరతో ఉడాయించిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో

5న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు ఈ నెల 5వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆదివారం తెలిపారు. టెలీ మెడిసిన్ హ బ్‌లో జనరల్ ఫిజీషియన్ పోస్టు-1, ఎన్‌సీయూలో పిడియాట్రిషిన్ పోస్టులు-2, ఆర్‌బీఎస్‌కేలో ఆడియాలజిస్టు పోస్టు-1, డెంటల్ టెక్నీషియన్ పోస్టు లు -రెండింటికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

కనకదుర్గమ్మ సేవలో ఉప సభాపతి కోలగట్ల



కనకదుర్గమ్మ సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అమ్మలుగన్న అమ్మ.. విజయవాడలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు. శాకంబరి అవతారంలో కొలువైన తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం.. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని దేవస్థానం ఈవో బహూకరించి, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజానీకమంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ఆ తల్లి ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు ఎంకేబీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాల విడుదల

విజయనగరం అర్బన్: పాలిటెక్నికల్ విద్యార్హతతో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈసెట్ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 1,553 మంది బాలురు, 402 మంది బాలికలు మొత్తంగా 1,955 అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,376 బాలురు, 379 మంది బాలికలు మొత్తం 1,755 మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,194 మంది బాలురు, 355 మంది బాలికలు కలిపి 1,594 మంది 90.22 శాతం అర్హత సాధించారు.

14 నుంచి ఇండ్‌సీల్ ఫెర్రో పరిశ్రమలో లేఆఫ్



గర్భాంలోని ఇండ్‌సీల్ ఫెర్రో పరిశ్రమ

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఇండ్‌సీల్ ఫెర్రో పరిశ్రమలో ఈ నెల 14వ తేదీ నుంచి లేఆఫ్ విధిస్తున్నట్టు ఆ పరిశ్రమ యాజమాన్యం ఆదివారం పరిశ్రమ గేటుకు నోటీస్ అతికించింది. దీనికి పరిశ్రమ కార్మికులు సహకరించాలని యాజమాన్య ప్రతినిధులు కోరారు.

ఇనాం భూముల రైతులకూ విత్తనాలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు

రేగిడి : ఇనాం భూములున్న రైతులకు కూడా ఈ ఏడాది ప్రభుత్వం విత్తనాలు అందించే కార్యక్ర మం చేపడుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నా రు. మండలంలోని వన్నలిలో రైతులకు ప్రభు త్వం అందిస్తున్న సాగు సంక్షేమ పథకాలపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షపాతి అని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఇనాం భూముల రైతులకు విత్తనాలు ఇచ్చేవారు కాదని, ఈ ఏడాది ఈ సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ఇనాం భూములు ఉన్న రైతులకు కూడా విత్తనాలు వస్తాయని పేర్కొ న్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ ఆర్‌బీకేల ద్వారా 24,738 క్వింటాళ్ల విత్తనాలు పంపి ణీ చేశారన్నారు. యూరియా, డీఏపీ ఎరువులు కూడా ఆర్‌బీకేలు వద్ద నిల్వ ఉన్నాయని, సకాలంలో పంపిణీ ఉంటుందని వివరించారు. మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు సాగు నీరు అందడం లేదని రైతులు ఆందో ళన చెందవద్దని, మడ్డువలస ప్రాజెక్ట్ షట్టర్ల మరమ్మతుల నిమిత్తం నీటిని విడిచిపెట్టారని, ప్రస్తుతం షట్టర్లు మరమ్మత్తులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వం సాగు నీటిని పూర్తి స్థాయి లో రైతులకు అందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసిందని వివరించారు. త్వరలో ప్రాజెక్ట్‌లోకి నీరు చేరుతుందని, కాలువల ద్వారా నీటిని విడిచిపెడతారని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మో హన రావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, బంకి చంద్రశేఖర్, జి.మోహనరావు పాల్గొన్నారు.

సమయం లేదు.. మిత్రమా...!

- గడువులోగా ప్రభుత్వ భవనాల పూర్తికి ఆదేశం
- సచివాలయాలు, ఆర్‌బీకేలకు డెడ్‌లైన్
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ డిసెంబర్ 31నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు
- అవసరమైతే అదనపు నిధులు



పూర్తయిన బలిజిపేట మండలంలోని చిలకలపల్లి సచివాలయం



గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర ఆర్‌బీకే



నిర్మాణం పూర్తయిన మక్కువ మండలంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగానే పల్లె గడప చెంతకు ప్రభుత్వ సేవలు అందేలా సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు ఇలా అన్నీ అందుబాటులోకి వచ్చాయి. వీటికి సొంత భవనాలు నిర్మించి భవిష్యత్‌లో ఇంకా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి తగు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆయా భవనాల పూర్తికి గడువు విధించింది. నిర్దేశించిన సమయంలోగా ఆయా భవనాలు పూర్తి చేసి ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని వడివడిగా అడుగులు వేస్తోంది.

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ భవనాలు నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలిచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రాధాన్యత భవనాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రూఫ్ లెవల్, రూఫ్ లెయిడ్ సెకండ్ స్లాబ్, ఫినిషింగ్, ఫిజికల్లీ కంప్లీటెడ్ దశల్లో ఉన్న నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఈ నిర్మాణాల పురోగతికి సంబంధించి ప్రతి శనివారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలకు అవసరమైతే అదనపు నిధులను విడుదల చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలియజేసింది. ఈ భవన నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్లను ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసింది. చేపట్టనున్న భవన నిర్మాణాలకు ఎలాంటి నిధుల కొరత లేనందున ఆయా భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం గడువు విధించింది.

సెప్టెంబరు 31 నాటికి 262 గ్రామ సచివాలయాల పూర్తి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఫిజికల్లీ కంప్లీటెడ్ దశలో ఉన్న 87 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను ఈ నెల 15 నాటికి అప్పగించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే తుది దశలో ఉన్న 91 భవనాలను సెప్టెంబరు 31 నాటికి, సెకండ్ స్లాబ్ పూర్తయిన 38 నిర్మాణాలను ఆగస్టు 15 నాటికి, రూఫ్ లెయిడ్లో ఉన్న 33 నిర్మాణాలను ఆగస్టు 31 నాటికి, రూఫ్ లెవెల్లో ఉన్న 13 నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి అప్పగించేందుకు పీఆర్ ఇంజినీర్లు కార్యాచరణను రూపొందించారు.

185 ఆర్‌బీకేలకు డెడ్‌లైన్

185 రైతు భరోసా కేంద్రాలను కూడా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు సంబంధిత ఇంజినీర్లు కార్యాచరణను సిద్ధం చేశారు. ఫిజికల్లీ కంప్లీట్ దశలో ఉన్న 67 ఆర్బీకేలను ఈ నెల 15వ తేదీకి అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ఫినిషింగ్ దశలో ఉన్న 41 భవనాలను జూలై 31 నాటికి, రూఫ్ లెయిడ్లో ఉన్న 31 నిర్మాణాలను ఆగస్టు 15 నాటికి, రూఫ్ లెవెల్లో ఉన్న 46 భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

కొత్త సంవత్సరం కానుకగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్

డిసెంబర్ 31 నాటికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ పూర్తి చేసి నూతన సంవత్సరానికి కానుకగా ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి జిల్లాలో వేర్వేరు దశల్లో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను డిసెంబర్ 31 నాటికి అప్పగించాలని ప్రభుత్వం సమయాన్ని నిర్దేశించింది. ఇందులో ఫిజికల్‌గా కంప్లీట్ అయిన 16 భవనాలను ఈ నెల 15 నాటికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఫినిషింగ్ స్టేజీలో ఉన్న 19 భవన నిర్మాణాలను జూలై 31 నాటికి, రూఫ్ లెయిడ్లో ఉన్న 18 నిర్మాణాలను ఆగస్టు 15 నాటికి, రూఫ్ లెవెల్లో ఉన్న 18 నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది.

జిల్లాలో అభివృద్ధి భవనాల వివరాలు	
మండలాలు	15
సచివాలయాలు	350
రైతుభరోసా కేంద్రాలు	306
జిల్లా జనాభా	9,25,340
ఒక్కో సచివాలయ నిర్మాణానికి	రూ.40 లక్షలు
రైతుభరోసా కేంద్రానికి	రూ.21.80 లక్షలు
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు	రూ.20.80 లక్షలు

పూర్తి చేస్తాం..



జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. బిల్లుల పెండింగ్ లేకపోవడం, చేసిన పనులకు అనుగుణంగా గ్రీన్ చానల్ ద్వారా నిధులను విడుదల చేయనున్న నేపథ్యంలో భవన నిర్మాణాల వేగం పెంచేందుకు క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. ఈ పనుల పురోగతిపై వారం వారం సమీక్ష నిర్వహిస్తున్నందున తప్పక పురోగతి చూపించి లక్ష్యాలను సాధిస్తాం.

– ఎంవీఆర్ కృష్ణాజీ, పంచాయతీరాజ్, ఎస్ఈ, పార్వతీపురం మన్యం

సర్వజన ఆస్పత్రిలో... సేవలు భేష్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు విస్తృతమయ్యాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని విభాగాల్లో అవసరమైనంత వైద్యులు, సిబ్బంది నియామకం కావడంతో అన్ని రకాల వైద్యసేవలు మెరుగయ్యాయి. దీంతో రోగులు, వారి బంధువులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- నెలలో 30 వేలకు పైగా అవుట్ పేషెంట్ రోగులకు సేవలు
- 450 వరకు మేజర్ ఆపరేషన్లు
- 84 వేల వరకు ల్యాబ్ పరీక్షలు

విజయనగరం ఫోర్ట్:

జిల్లా ఆస్పత్రి సర్వజన ఆస్పత్రిగా మారిన తరువాత వైద్య సేవలు మరింత విస్తరించాయి. గతంలో ఇక్కడకు వచ్చేందుకు ఆలోచించిన రోగులు ఇప్పుడు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వైద్య సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారిన తరువాత విభాగాలు కూడా విస్తృతమయ్యాయి. వైద్య సిబ్బందిని కూడా అవసరం మేరకు ప్రభు త్వం నియమించింది. అన్ని రకాల వైద్య సేవలు అందుతుండడంతో రోగులు వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆస్పత్రిలో సేవలు అందిస్తుండడంతో కార్పొరేట్‌ను తలదన్నేలా రోగులకు సేవలు అందుతున్నాయి. ఇక్కడ సూపర్ స్పె షాల్టీ సేవలు మినహా అన్నిసేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో నలుగురు నుంచి పది మంది వరకు వైద్యులు ఉండడంతో రోగులు నిరీక్షించాల్సిన పనిలేకుండా సత్వర సేవలు పొందుతున్నారు.

నెలకు 30వేలకు పైగా అవుట్ పేషెంట్లు

సర్వజన ఆస్పత్రిలో నెలకు 30 వేలకు పైగా అవుట్ పేషెంట్లు సేవలు పొందుతున్నారు. నెలలో 2800 వరకు ఇన్ పేషెంట్లు సేవలు పొందుతున్నారు. అలా గే 450 పైబడి మేజరు ఆపరేషన్లు జరుగుతున్నాయి. కుటుంబ నియంత్రం శస్త్రచికిత్సలు 50 నుంచి 60 వరకు జరుగుతున్నాయి. అదే విధంగా 400 నుంచి 450 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లు 1700 నుంచి 2 వేల వరకు జరుగుతున్నాయి. రెండు వేల పైబడి ఎక్స్‌రేలు రోగులకు తీస్తున్నారు. 1600 నుంచి 1700 వరకు ఈసీజీలు తీస్తున్నారు. ల్యాబొరేటరీలో 80 వేల నుంచి 85 వేల వరకు పరీక్షలు చేస్తున్నారు.

ఏప్రిల్, మే నెలలో అందిన వైద్య సేవల వివరాలు	
విభాగం	సేవలు పొందిన వారి సంఖ్య
అవుట్ పేషెంట్స్	60,889
ఇన్ పేషెంట్స్	5,512
మేజర్ ఆపరేషన్లు	898
కు.ని ఆపరేషన్లు	99
ప్రసవాలు	825
అల్ట్రాసౌండ్	3631
ఎక్స్‌రేలు	4434
ఈసీజీ	3260
ల్యాబ్ టెస్టులు	1,63,800

ఆస్పత్రి విభాగాలు

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, డెంటల్, ఎన్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పలమనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్, బయోకెమిస్ట్రీ వంటి విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, సీటీ స్కాన్, ఎంఆర్ ఐ స్కాన్, టూడీ ఇకో సేవలు అందుబాటులో ఉన్నా యి. అదేవిధంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే ల్యాబొరేటరీ కూడా ఉంది. అదేవిధంగా కేన్సర్ నిర్ధారణ చేసే ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు కూడా జరుగు తు న్నాయి. ముఖ్యంగా యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ వంటి ఆధునాతన వైద్య పరీక్షలు కూడా జరుగుతు న్నాయి. అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి.

వైద్య సేవలు విస్తృతం

సర్వజన ఆస్పత్రిలో గతంలో కంటే అన్ని రకాల వైద్య సేవలు పెరిగాయి. వైద్యులు, సిబ్బంది అందరు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఓపీ, ఐపీ, ఆపరేషన్లు ఇలా అన్ని పెరిగాయి. ఆస్పత్రికి వచ్చిన వారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది పని తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ కార్యవర్గం ఎన్నిక

విజయనగరం అర్బన్/పూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కార్యవర్గా న్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా జి.రామ్‌కుమార్ (జీఎల్‌పురం), కో చైర్మన్‌గా పి.నాగేశ్వరరావు (కురుపాం), పి.శ్రీనివాసరావు (నిమారింగి), బి.లోకనాథం (కొత్తవలస), ఎల్.సంధ్య (నెల్లిమర్ల), ఎన్.భద్రావతి (చీపురుపల్లి), కె.బాబ్జీ (మక్కువ)లను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. ఉమ్మ డి విజయనగరం జిల్లా నలుమూలల నుండి 2009 – 2012 వరకు గల కాంట్రాక్ట్ అధ్యాపకులు హాజరై 2014 జూన్ రెండు నాటికి సర్వీసులో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ రెగ్యులర్ చేయాలని, ఐదేళ్ల సర్వీసు నిబంధనను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఆదివాసీ హక్కుల కోసం ర్యాలీ



బూర్జివలస గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీఎఫ్ నాయకులు

కొమరాడ: ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణకు మండలంలోని బంజుకుప్ప, బూర్జివలస గ్రామాల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అఖిల భారత ఆదివాసీ వేదిక(ఏఐటీఎఫ్) జాతీయ కమిటీ సభ్యురాలు సంబుడు జయలక్ష్మి మాట్లాడారు. అటవీ భూములు, సంపద పరిరక్షణకు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు.

రాజ్యాంగంలో ఆదివాసీలకు కల్పించిన హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. 2020 అటవీ సంరక్షణ నియమాలు వంటి సవరణలు తెచ్చి అటవీ సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టాలని చూస్తోందన్నారు. ఆదివాసీలను అటవీ ప్రాంతాల నుంచి తరిమిసేందుకు చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్యంగా తిప్పికొడదామని పిలుపునిచ్చారు. ర్యాలీలో ఆదివాసీలు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 పోస్టుల నియామకానికి కౌన్సెలింగ్

- జోనల్ స్థాయిలో విశాఖపట్నంలో పూర్తయిన కౌన్సెలింగ్
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 17 మండలాలకు కౌన్సెలింగ్
- బాడంగి, జియ్యమ్మవలస, వేపాడ మండలాల్లో జరగని నియామకాలు



వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం

వీరఘట్టం: సర్కారు బడుల బలోపేతంపై ప్రభుత్వం మరింత ఫోకస్ పెట్టింది. బడుల నిర్వహణ, నియంత్రణ, అమ్మ ఒడి వంటి సంక్షేమ పథకాల పక్కా అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మండలానికి ఒక ఎంఈఓ ఉండగా, మరో ఎంఈఓ పోస్టును కేటాయిస్తూ ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. గత నెల జూన్ 18న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాలకు, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 34 మండలాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని వంగర, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో ఎంఈఓ 2 పోస్టుల్లో చేరేందుకు హెచ్ఎంలు ఎవరూ సుముఖత చూపలేదు. తాజాగా ఆదివారం విశాఖపట్నంలో జోనల్ స్థాయిలో అర్హులైన ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ 1 పోస్టుల్లో నియమించేందుకు ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల 33 మండలాల్లో ఎంఈఓ 1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా రెండు జిల్లాల్లోని ఐదు మండలాల్లో ఎంఈఓ 1 పోస్టుల్లో చేరేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 17 మండలాలకు కౌన్సెలింగ్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో బాడంగి, బలిజిపేట, బొండపల్లి, చీపురుపల్లి, డెంకాడ, గంట్యాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, మక్కువ, మెంటాడ, మెరకముడిదాం, నెల్లిమర్ల, పార్వతీపురం, పూసపాటిరేగ, సాలూరు, శృంగవరపుకోట, వేపాడ తదితర 17 మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాడంగి, జియ్యమ్మవలస, వేపాడ మండలాల్లో ఎంఈఓ-1 పోస్టులో చేరేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మండలాల్లో ఇప్పటికే ఎంఈఓ-2 పోస్టుల నియామకం జరిగింది.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, భామిని, బూర్జ, గార, కోటబొమ్మాళి, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, మందస, పాలకొండ, పాతపట్నం, పొందూరు, రాజాం, టెక్కలి, వజ్రపుకొత్తూరు, వంగర, వీరఘట్టం తదితర 16 మండలాల్లో ఎంఈఓ-1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వజ్రపుకొత్తూరు, వంగర మండలాల్లో ఎంఈఓ-1 పోస్టులో చేరేందుకు ప్రధానోపాధ్యాయులు ఎవరూ సముఖత చూపకపోవడంతో ఈ పోస్టులు భర్తీ కాలేదు. వంగర మండలంలో ప్రస్తుతం ఎంఈఓ-1, 2 రెండు పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి.

విద్యా వ్యవస్థలో నూతన శకం

ప్రతీ మండలానికి ఇద్దరు విద్యాశాఖ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్ర విద్యా వ్యవస్థలో నూతన శకం మొదలైందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ బడుల బలోపేతానికి మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసి విద్యార్థులకు కార్పొరేటు స్థాయి మౌలిక వసతులు కల్పించారు. అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసి అందులో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.2 వేలు ఇచ్చేలా చర్యలు చేపట్టింది. అంతేకాకుండా జగనన్న విద్యాకానుక కిట్లు ద్వారా పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు విద్యార్థికి అవసరమయ్యే అన్ని వస్తువులను సమకూర్చి సర్కారు బడులను ప్రగతి పథంలోకి తీసుకువచ్చారు.

ఇద్దరు ఎంఈఓలతో మరింత పర్యవేక్షణ



ప్రతీ మండలానికి ఇద్దరు ఎంఈఓల నియామకం వల్ల పాఠశాలల పర్యవేక్షణ బాగుంటుంది. ఒకరు ఆఫీసులో అడ్మినిస్ట్రేషన్‌తో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. మరొకరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ, తరగతి గదిలో విద్యా బోధన, నాడు – నేడు పనుల పర్యవేక్షణ, తదితర అంశాలను సులువుగా పర్యవేక్షిస్తారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెరుగుతాయి. మిగిలిన మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హులైన వారిని నియమించేందుకు చర్యలు చేపడతాం.

– ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఎంఈఓ-1లు ప్రమోషన్ ద్వారా నియామకం

విజయనగరం పూల్‌బాగ్: జోన్ పరిధిలో ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 55 మండలాలకు ఎంఈఓ - 1లను ప్రమోషన్ ద్వారా నియమిస్తూ ఆదివారం ఆర్జేడీ జ్యోతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పి.అప్పారావు(పాలకొండ), ఎన్.శ్యామ్ సుందరరావు(బూర్జ), కె.వెంకటరమణ(డెంకాడ), యు.సూర్యనారాయణ(నెల్లిమర్ల), కె.శోభారాణి(బొండపల్లి), బి.రాజాకుమార్(సాలూరు), ఎ.శ్రీనివాసరావు(భామిని), బి.వి జయకుమారి(గంట్యాడ), పి.ప్రవీణ్‌కుమార్(రాజాం), డి గౌరునాయుడు (వీరఘట్టం), ఎ.రాజ్‌కుమార్ (పూసపాటిరేగ), బి.చంద్రశేఖర్(జీఎల్‌పురం), ఎమ్.బూసినాయుడు(చీపురుపల్లి), పి.సత్యనారాయణ(మక్కువ), ఎం.చంద్రశేఖర్‌రావు(మెరకముడిదాం), బి.నరసింగరావు(ఎస్ కోట), ఎస్.సింహాచలం(బలిజిపేట), కె.మోహన్‌రావు(మెంటాడ) నియమితులయ్యారు.

క్లుప్తంగా

సైన్స్ అవార్డులను పునరుద్ధరించాలి

● జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ డిమాండ్


సైన్ వాక్ ర్యాలీ పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

విజయనగరం అర్బన్: శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పట్ల ప్రభుత్వానికి చిన్న చూపు తగదని రద్దు చేసిన సైన్స్ అవార్డులను పునరుద్ధరించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్‌వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సైన్స్ వాక్ ర్యాలీ జరిగింది. గురజాడ గృహం నుంచి మూడు లాంతర్ల జంక్షన్ గంటస్తంభం మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపివేయాలని శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రకటించడం సాంకేతిక అభివృద్ధి తిరోగమనానికి దారి తీస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను రద్దు చేయడంతో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా కూడా 20 పైగా అవార్డులను పక్కకు పెట్టిందని విమర్శించారు. అవార్డులను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, వివిధ సంఘాల ప్రతినిధులు చీకటి దివాకర్, డి.రాము, రమేష్ పట్నాయక్, ఆర్.విజయ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కె.శశిధర్, వెంకటేష్, సురేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చోరీపై డీఎస్పీ ఆరా



డీఎస్పీకి చోరీ ఘటనను వివరిస్తున్న బాధితురాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బొబ్బిలి రోడ్డులోని వరలక్ష్మినగర్‌లో గత నెల 30న రాత్రి జరిగిన చోరీలో 14 తులాల బంగారం, ఒక ఐఫోన్ పోయిన ఘటనకు సంబంధించి చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాసచక్రవర్తి సంఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. చోరీ జరిగిన తీరుపై బాధితులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నామ న్నారు. దర్యాప్తు వేగవంతం చేసి నేరానికి పాల్పడిన వారిని పట్టుకుంటామని వెల్లడించారు. రాత్రి సమయాల్లో అన్ని ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని రాజాం పోలీసులకు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయనతోపాటు రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్సై వై.రవికిరణ్ తదితరులు ఉన్నారు.

పిడుగుపడి ఆవు మృతి

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో ఆదివారం సాయంత్రం మేతకు వెళ్లి వస్తున్న ఆవుపై గ్రామసమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వీఆర్వో పి.సింహాచలం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళా రైతు కొల్లి సత్యవతి ఆవు (రూ.50వేల విలువ) మృతి చెందిన విషయాన్ని తహసీల్దార్, గురుమూర్తి, పశువైద్యాధికారికి సమాచారం అందించినట్లు వీఆర్వో తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు


నక్కానపేటలో 144 అడుగుల సాయి స్థూపం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేటలో సోమవారం గురుపౌర్ణమి వేడుక లు ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలోనే ఎత్తైన సాయి స్థూపం (144 అడుగులు) ఇక్కడే ఉండడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేస్తా రు. అలాగే సాయికోటి పుస్తకాలు స్థూపంలో వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ట్రస్ట్ అధినేత బొడ్డు విజయరామయ్య ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు హోమాలు నిర్వహించనున్నారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం సీఐ కేవీవీ విజయనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

రైతులకు మిత్రలాభం..!

● చీడ పురుగులను నాశనం చేసే కీటకాలు
● ఏటా పెరుగుతున్న క్రిమిసంహారక మందులు
● మాయమైపోతున్న మేలు చేసే పురుగులు


రసాయన మందులను పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

పార్వతీపురం: రైతుల కష్టార్జితాన్ని తినేసే చీడ పురుగులను నాశనం చేసేందుకు మేలు చేసే పురుగులను కూడా ప్రకృతి సృష్టించింది. అందుకే వీటిని మిత్రపురుగులంటారు. ఒకప్పుడు ఇవి పంటలను ఆశించే తెగుళ్లను తినేస్తూ రైతుకు అండగా ఉండేవి. ఈ నేపథ్యంలో నాణ్యమైన, మేలైన ఉత్పత్తులు లభించేవి. కాని తెగుళ్ల నివారణకు రైతులు క్రిమిసంహారక మందులను విచక్షణా రహితంగా వాడడం మొదలు పెట్టాక మేలు చేసే మిత్ర పురుగులు కూడా అంతరించిపోతున్నాయి. పంటసాగులో నష్టపరిచే పురుగులతోపాటు వాటిని అదుపులో ఉంచే బదనికలు (చీడపురుగులను తినేవి), పరాన్న జీవులు (చీడ పురుగుల మీద జీవనం సాగించేవి) ఉన్నాయి. పంటలను ఆశించే చీడపురుగులు ఎక్కడ ఉంటే ఇవీ అక్కడే ఉంటాయి. వాటిని గుర్తించి కాపాడుకుంటే తెగుళ్ల రాకుండా పంటలను కాపాడతాయి.

లేడీ బర్డ్ బీటిల్స్ (అక్షింతల పురుగు)

ఎరుపు రెక్కలపై నల్లని మచ్చలతో అక్షింతల పురుగులుంటాయి. ఇవి లార్వా దశలో ఎక్కువగా పేనుబంక పురుగులను తిని జీవిస్తాయి. తల్లి పురుగులు సుమారు 300–400 సన్నటి పసుపు పచ్చని సూదులు లాంటి గుడ్లను ఆకుల అడుగు భాగంలో గుంపులుగా గుచ్చుతాయి. గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు 7–10 రోజుల వరకు, తల్లి పురుగులు 40–45 రోజులవరకు చీడ పురుగులను తింటూ జీవిస్తాయి.

ప్రేయింగ్ మేంటీ (గొల్లభామ)

ఒకప్పుడు కుప్పలు తెప్పలుగా కనబడే గొల్లభామలు ఇప్పుడు అక్కడక్కడా మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇవి కూడా రైతులకు బాగా ఉపయోగపడతాయి. దీన్ని ఇంగ్లీష్‌లో ప్రేయింగ్ మేంటీ అంటారు. ఇది పంటలను ఆశించే ఆకురసం పీల్చే పురుగులతోపాటు ఇతర చీడ పురుగులను తింటుంది.

ట్రయికోగ్రామా (కందిరీగ)

పరాన్న జీవులకు సంబంధించిన ఈ కందిరీగ 200 రకాల చీడపురుగులను గుడ్ల దశలో ఆశిస్తాయి. తల్లి పురుగు 63–118 గుడ్లు పెడుతుంది. దీని జీవిత కాలం ఏడు, ఎనిమిది రోజుల్లో ముగుస్తుంది. ఏడాదికి 36 తరాలను వృద్ధి చేస్తుంది.

సాలీడు పురుగులు

సాలీడులు అనేక రకాల రంగుల్లో, ఆకృతులలో ఉంటాయి. తల్లి పురుగులు, పిల్ల పురుగులు కలిసి పేనుబంక, పచ్చదోమ, ఆకుముడత, ఎర్రనల్లి గుడ్లను తొలి దశలో ఉన్న లార్వాలను తింటాయి. తల్లి పురుగులు గుడ్ల సముదాయాన్ని ఆకుల పైభాగాన పెడతాయి. ఇవి తెల్లని గోధుమ రంగు పల్చటి పొరతో కప్పబడి ఉంటాయి. మొక్కలను కదిలించినప్పుడు చురుగ్గా కదులుతాయి.


అంక్షితల పురుగు


గొల్లభామ


కందిరీగ


సాలీడు పురుగు


రెక్కల పురుగు

జీవ నియంత్రణ పద్ధతే మేలు..



తెగుళ్ల నివారణకు జీవ నియంత్రణ పద్ధతి మేలు. పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వల్ల చీడపీడలు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నాయి. ఫలితంగా రైతులు ఇంకా భారీగా మందులు వాడాల్సి వస్తోంది. ఫలితంగా ఖర్చు ఎక్కువై దిగుబడి తగ్గి నష్టపోవాల్సి పరిస్థితి దాపురిస్తోంది. పంటలను ఆశించే తెగుళ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ రైతులకు మేలు చేసే మిత్ర పురుగుల పట్ల విద్యార్థులతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డా. బి.ప్రసన్నకుమార్,
అసోసియేట్ డీన్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానశాఖ కళాశాల, పార్వతీపురం

రెక్కల పురుగు

ఆకుపచ్చ రెక్కలుగల ఈపురుగు తూనీగలా ఉంటుంది. పొడవు 1.0–1.3 సెంమీ. వెడల్పు, 1–2 మిల్లీ మీటర్లు కళ్లు బంగారు రంగులో మెరుస్తుంటాయి. ఈ పురుగు ఆకుల అడుగు భాగాన లేదా మొక్క ఇతర భాగాల అడుగు భాగాన గుడ్లు పెండుతుంది. వాటినుంచి పిల్ల పురుగులు మూడు, నాలుగు రోజుల్లో బయటకు వస్తాయి. ఇవి మొదట తెల్లగా, ఆ తర్వాత గోధుమ రంగుకు మారతాయి. లార్వాదశలో మూడుసార్లు మార్పుచెంది 8–10 రోజుల్లో పెద్దవవుతాయి. ఈ పురుగులకు వాడిగా దంతాలు ఉండడం వల్ల చీడపురుగులపై దాడిచేసి తింటూ జీవిస్తాయి. ఇవి లార్వాదశలో పేనుబంక, తెలదోమ, పచ్చదోమ, తొలిదశలో ఉన్న శనగపచ్చ పురుగు, గొంగలి, పొగాకు లద్దె పురుగులను తినేస్తాయి.

మాయలేడీ అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ ఎం.నాగేశ్వరరావు తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్(యూనియన్ బ్యాంకు)వద్ద ఇటీవల ఓ వృద్ధుడ్ని నమ్మించి ఇంటివద్దకు చేర్చి రూ.లక్షన్నరతో ఉడాయించిన మహిళను పోలీసులు అరెస్టు చేసి విలేకరుల ముందుప్రవేశపెట్టిన అనంతరం నిందితురాలిని రిమాండ్ నిమిత్తం తరలించారు. ఈ విషయమై డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ ఎం.నాగేశ్వరరావులు ఆదివారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పూల్‌బాగ్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి క్రాలేటి వెంకటరమణ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం నగదు విత్ డ్రాచేసేందుకు యూనియన్ బ్యాంకుకు వెళ్లారు. ఆ సమయంలో పట్టణంలోని గొల్లపల్లికి చెందిన గొల్ల పల్లి శ్రావణి బ్యాంకు వద్ద డబ్బు విత్‌డ్రా చేసిన వృద్ధుడ్ని గమనించి మాటలు కలిపి రిక్షా ఎక్కించి ఆయన ఇంటివద్దకు తీసుకువెళ్లి ఒక్క ఉదుటన లోనికి తోసి డబ్బుతో పరారైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీలు పరిశీలించిన పోలీసులు ఒడిశా వెళ్లిపోయేందుకు బస్సెక్కుతున్న మహిళను ఆదివారం పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. నిందితురాలు సాలూరులోని కన్నవారింటి వద్ద పిల్ల లను చదివించేందుకు ఉంచి భర్తతో ఒడిశాలోని జేకేపూర్‌లో ఉపాధి నిమిత్తం ఉంటోంది. ఇటీవల అమ్మఒడి డబ్బులు బ్యాంకు ఖాతాలో పడడంతో విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుకు వచ్చి వృద్ధుడ్ని మోసం చేసింది. ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేశారని, రిమాండ్ నిమిత్తం నిందితురాలిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్టు డీఎస్పీ వెల్లడించారు. బ్యాంకుల వద్ద మోసగాళ్లను పరిశీలించి అనుమానం వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ప్రజలకు డీఎస్పీ సూచించారు.

లోయలో పడిన ఆటో: ముగ్గురికి తీవ్రగాయాలు


జియ్యమ్మవలస/కురుపాం: ఆటో–కిందపడిన వ్యక్తులు

జియ్యమ్మవలస/కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం ఊసకొండ సమీపంలో ఘాట్‌రోడ్ వద్ద ఆదివారం బ్రేక్ ఫెయిలై అదుపుతప్పిన ఆటో లోయలో పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే జియ్యమ్మవలస మండలం చినమేరంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా హాస్పటల్‌కు తరలించినట్లు చినమేరంగి వైద్య సిబ్బంది తెలిపారు. బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బెజ్జి ప్రసాద్ (35), వావిలాపల్లి కృష్ణ, (45), జయమ్మ (65)లు కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం గ్రామానికి మద్యం మానిపించడానికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి..


గరుగుబిల్లి: చికిత్స పొందుతున్న శంకరరావు

గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ముషిడిపల్లి శంకరరావు శుభకార్యం నిమిత్తం ద్విచక్రవాహనంపై అడారి గ్రామానికి వెళ్లి తిరిగి తోటపల్లి వస్తుండగా నాగూరు పవర్‌స్టేషన్ సమీపంలో ఖడ్గవలసనుంచి వీరఘట్టంవైపు వస్తున్న లగేజీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరరావు ద్విచక్ర వాహనం పై నుంచి రోడ్డు పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనంద్వారా క్షతగాత్రుడిని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

స్నేహితుల గొడవలో చాకుతో దాడి..


శృంగవరపుకోట: దాడిలో గాయపడిన బంగారయ్య

శృంగవరపుకోట: ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. శృంగవరపు కోటకు చెందిన కుక్కల అప్పయ్య, నోట్ల బంగారయ్య మంచి స్నేహితులు. వారిద్దరూ ధర్మవరం గ్రామంలో ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్లారు. ఇద్దరూ మద్యం తాగి శుభకార్యం జరిగిన ఒక గదిలోకి వెళ్లారు. వెళ్లిన కొంత సమయానికి బంగారయ్య తీవ్ర రక్తస్రావంతో బయటకు వచ్చాడు. అప్పయ్య చాకుతో వెనుకగా వచ్చాడు. స్థానికులు ఈఘటన చూసి రక్తస్రావంతో ఉన్న బంగారయ్యను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై తారకేశ్వరరావు ఘటనాస్థలానికి వెళ్లి ఆరా తీశారు. అనంతరం ఈ ఘటనపై కేసునమోదు చేశారు.

బైక్ ప్రమాదంలో మరొకరికి..


వంగర: బాధితుడిని ఆస్పత్రికి తీసుకువెళ్తున్న 108 సిబ్బంది

వంగర: మండల పరిధి మద్దివలస వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

గురు పౌర్ణమికి సర్వం సిద్ధం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సాయినాథుడు

విజయనగరం టౌన్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని షిర్డీ సాయినాథుని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. భక్తుల తాకిడి నేపథ్యంలో ఆలయాల వద్ద బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్థానిక సింహాద్రినగర్ రింగురోడ్డులో గల షిర్డీ సాయిబాబా ఆలయం విద్యుత్ అలంకరణలతో ముస్తాబైంది. బాబాను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కరణం జనార్దనరావు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. అదేవిధంగా వ్యాసపూర్ణిమ పురస్కరించుకుని వాగ్దేవి సమారాధనం, జై పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవాసంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కోట వద్ద నుంచి వ్యాస భగవా నుని తిరువీధి ఉత్సవం అమ్మవారి కల్యాణ మంట పం వరకు నిర్వహించనున్నారు. అనంతరం కల్యా ణ మంటపం ఆవరణలో నిర్వహించే సభా కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు, గురువులు సమాజ సేవకులను సత్కరించనున్నారు.

ఏళ్ల నాటి సమస్య పరిష్కారం..

● ధన్యవాదాలు తెలియజేసిన లబ్ధిదారు


పిల్లలకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న బంటు రాధ

పాచిపెంట: ఏళ్ల నాటి సమస్య జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కారమైనందుకు చాలా ఆనందంగా ఉందని మండలంలోని గురువునాయుడుపేట గ్రామానికి చెందిన బంటు రాధ అనే మహిళ తెలిపింది. వివరాల్లోకి వెళితే... బతుకుదెరువుకు 2006లో చెన్నై వెళ్లిన రాధకు అదే సమయంలో అక్కడికి వలస వచ్చిన కాకినాడ దగ్గర యానాం ప్రాంతానికి చెందిన గుత్తిల రామకృష్ణ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకుని అక్కడే జీవనం సాగిస్తూ ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చారు. 2013లో రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందగా... రాధ తన ఇద్దరు పిల్లలతో కన్నవారింటి గురువునాయుడుపేట వచ్చేసింది. ఇదిలా ఉంటే రామకృష్ణ శెట్టిబలిజ కులానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, రాధ వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పిల్లలకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు కాలేదు. సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. రాధ కుమార్తెలు చదువుకుంటున్నప్పటికీ కులధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు వర్తించలేదు. ఈ క్రమంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం గురువునాయుడుపేటకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు రాధ తన సమస్య చెప్పుకుంది. వెంటనే రాజన్నదొర అధికారులతో మాట్లాడి, మహిళ భర్త ఏ ప్రాంతానికి చెందినవాడో తెలుసుకుని, అక్కడ పెద్దల వాంగ్మూలం తీసుకుని కులధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుని రాధకు ఆదివారం కులధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

మెట్టపై గుర్తు తెలియని మృతదేహం


మెట్టపై దాలినాయుడు మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెదతరిమి గ్రామ శివారులో మెట్టపై గుర్తు తెలియని మృతదేహం ఆదివారం కలకలం రేపింది. అటుగా వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో వెళ్లి చూసి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై నారాయణరావు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం వేల్పురాయి గ్రామానికి చెందిన బాలి దాలినాయుడు(59)గా గుర్తించారు. ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేల్పురాయి గ్రామానికి చెందిన దాలినాయుడు గత నెల 17న బ్యాంక్ పని నిమిత్తమని చెప్పి ఇంటినుంచి వెళ్లాడు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు దాలినాయుడి ఆచూకీ కోసం సమీప ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రణస్థలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో తరచూ ఇంటినుంచి బయటకి వెళ్లి కొన్ని రోజులు తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో పెదతరిమి గ్రామం వైపు వెళ్లిన దాలినాయుడు మెట్టపైకి వెళ్లి..ఆహారం, నీరు అందక మృతి చెంది ఉంటాడని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. చనిపోయి చాలా రోజులు కావడంతో మృతదేహం బాగా కుళ్లిపోయింది. దీంతో అక్కడే పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యజమానికి నమ్మక ద్రోహం

● ముగ్గురిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: నమ్మిన బంటుల్లా పనిచేస్తున్న ముగ్గురువ్యక్తులు ఓ కిరాణా షాపు యజమాని కళ్లుగప్పి షాపులో ఉన్న సామగ్రిని కొన్ని నెలలుగా చాటుగా అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 24న అదే రీతిలో వేరే వ్యక్తులకు సరుకు అమ్ముతుండగా సడన్‌గా యజమాని కుమారుడికి పట్టుబడ్డారు. దీంతో బాధిత యజమాని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పీడబ్ల్యూ మార్కెట్‌లో పంచదార, పప్పులు హోల్‌సేల్ అమ్మకాలు చేస్తున్న కె.సంతోష్ వద్ద పదేళ్లుగా కలాసీ, అకౌంటెంట్, కూలీగా పనిచేస్తున్న వారు యజమానిని మోసం చేశారు. ఈ నెల 24న మధ్యాహ్నం షాపులో ఉన్న పప్పులు, పంచదార వేరే వ్యక్తులకు అమ్ముతుండగా యజమాని సంతోష్ గమనించి నిలదీశాడు. ముగ్గురిని మార్కెట్ కమిటీ ముందుపెట్టి, రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. అయితే ఆ నష్టాన్ని ఇచ్చేస్తామని నిందితులు ముగ్గురూ ఒప్పుకున్నప్పటికీ డబ్బు ఇవ్వకపోవడంతో వేరేదారి లేక బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఈసెట్‌లో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ


జీవిత


ఉమామహేశ్వరరావు


కల్యాణి

నెల్లిమర్ల రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏపీఈసెట్‌లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ఆదివారం విడుదలైన ఫలితాల్లో చంద్రంపేట గ్రామానికి చెందిన వాళ్లె జీవిత ఈఈఈ విభాగంలో 128 మార్కులతో 3వ స్థానంలో నిలిచింది. వల్లూరు గ్రామానికి చెందిన మండాల ఉమామహేశ్వరరావు 115 మార్కులు సాధించి 4వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. అలాగే బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్‌కు చెందిన బంటు కల్యాణి 54వ ర్యాంకు సాధించింది. కల్యాణి తండ్రి స్థానిక విద్యాన్ కాలేజ్‌లో పని చేస్తుండగా తల్లి సుశీల అంగన్వాడీ టీచర్. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,070–00
బంగారం(22సి. 10గ్రా.)	54,150–00
వెండి (కిలో)	75,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS
■ NRR వ్యవసాయ పాలిటెక్నిక్, నెలివర్తి, సాలూరు మండలం, వ్యవసాయ మరియు సీడ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సుల కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. సంప్ర : 91826 39173, 79815 98164 [V- 1971]

PLOT FOR SALE
■ రామభద్రాపురం జం. ఎదుట రోడ్డు బాడంగి – రాజాం రోడ్డును ఆనుకొని DTCP డెవలప్స్‌తో 60 బిట్స్ & గజపతినగరం ఊరు వెనుక పాత బస్సాం దగ్గర 100 గII బిట్స్ సేల్స్‌కు కలవు. ఫోన్ : 99637 78171 [V- 10753]

SITE FOR SALE
■ 250 గజాలు, 40 ఫీట్ రోడ్, వుడా అప్రూవ్డ్ (LRS), సాయి కీర్తన నగర్ లే అవుట్, KL.పురం & 60 గజాలు కనపాక మధుర అయ్యన్నపేట, ఊటి రాజు గారి లేవుట్, విజయనగరం. అమ్మకంనకు కలవు వెస్ట్ ఫేసింగ్స్. ఫోన్ : 9247775268. [S-1195885]

PEST CONTROL
■ చెదలు, బొద్దింకలు, నల్లులు దోమలు నివారణ. అతితక్కువ ఖర్చు వాసన మరకలు లేని కెమికల్స్ Finest పెస్ట్ కంట్రోల్. ఫోన్ : 9391343911 [HA-11269]

WANTED
■ WANTED Drivers for School Bus సంప్రదించండి. 9866083612, 6300325783. [S-1195723]

■ Hostel Wardens Male / Female (Qly:Any Degree) & PET (M/F) (Qly: B.P.Ed/D.P.Ed) Cont: 6300325783, 8886663000, 9640457222. [S-1195724]

■ ప్రముఖ బ్యాంక్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంII డ్యూటీ, 26 Days, మంచి జీతం, PF + ESI + Incentive, ప్రదేశం: S.Kota ✆ 89857 49622 [B-288]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K ఫోన్: 9848571888 [H-189301]

■ కష్టలేనీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000–35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. ఫోన్ : 8919613984. [HA-366]

■ VISA Consultation overseas Blue & White Colour Jobs. All Profiles Lucrative. Salary High Pay. Interview 3rd to 5th July Hyd & 8 to 11 July Vizag. Ph: 9717618737 [HA-3070]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.